# కాంగ్రెస్ హయాంలో రైతుల కండ్లలో కన్నీరు

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య


ఎండిన పొలంలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

తుంగతుర్తి, ఏప్రిల్ 6: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాల్వల ద్వారా కాళేశ్వరం నీళ్లు పారితే, నేడు కాంగ్రెస్ పాలనలో రైతు కండ్లలో కన్నీరు పారుతున్నాయని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య విమర్శించారు. మండల పరిధిలోని కేశవాపురం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎండిన పొలాల్లో రైతులతో కలిసి ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీతయ్య మాట్లాడుతూ నీళ్లు లేక ఎండిన పొలాలను చూసి రైతులు గుండెలు బాదుకుంటూ విలపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలో ఏ గ్రామాన్ని సందర్శించినా ఎండిన పొలాలు దర్శనమిస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎండిన పొలాలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తూం వెంకన్న, నాయకులు వెంకటనర్సు తదితరులు పాల్గొన్నారు.

## 'బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలి'

తుంగతుర్తి, ఏప్రిల్ 6: వరంగల్‌లో ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, మాజీ ఎంపీపీ గుండగాని కవితారాములుగౌడ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గానుగబండ గ్రామంలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సభకు బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కంచర్ల కుశలవరెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండగాని దుర్గయ్య, మాజీ ఉపసర్పంచ్ పోలేపాక పరమేశ్, గుండగాని వీరయ్య, పంజాల యాదగిరి, పంజాల సోమయ్య, గుండగాని సూర్యప్రకాశ్, శ్రీహరి, కట్ల చంద్రయ్య, గోపగాని శ్రీనివాస్, లక్ష్మయ్య, దేవదాస్, సతీశ్ పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాలతో సమాజంలో గుర్తింపు

- ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశులు


మహిళకు ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశులు

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 6: సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని, సేవా గుణం పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్ (నేషనల్ సర్వీస్ స్కీమ్) ఎంతగానో దోహదపడుతుందని ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.వెంకటేశులు అన్నారు. ఆత్మకూర్.ఎస్ మండలంలోని ఏనుబాముల గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ క్యాంపు చివరి రోజులో భాగంగా ఆదివారం గ్రామానికి చెందిన ఓ పేద మహిళకు ఆర్థిక సాయం అందజేసి మాట్లాడారు. గత వారం రోజులుగా విద్యార్థులు గ్రామంలోనే ఉంటూ స్వచ్ఛందంగా కాల్వలను, గ్రామ పరిసరాలను శుభ్రం చేయడం, చెట్లు నాటడం, రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లను తొలగించడం వంటి పనులు చేపట్టారని తెలిపారు. మద్యపానం, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఒక గ్రామం ఆదర్శ గ్రామంగా మారాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరం ఉంటుందని గుర్తు చేశారు. అనంతరం ఓ పేద మహిళకు రూ.వెయ్యి నగదుతో పాటు 25 కేజీల బియ్యం, 10 నూనె ప్యాకెట్లు, నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రోగ్రాం ఆఫీసర్ మధు, సృజన పాల్గొన్నారు.

# రోడ్డును కమ్మేసిన కంపచెట్లు


మేళ్లచెర్వు నుంచి ఎర్రగట్టు తండాకు వెళ్లే దారిలో పెరిగిన కంపచెట్లు

మేళ్లచెర్వు, ఏప్రిల్ 6: మండల కేంద్రం నుంచి ఎర్రగట్టు తండా గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. నిత్యం ఈ మార్గం గుండా రైతులు పొలాలకు రాకపోకలు సాగిస్తుంటారు. కంపచెట్ల కారణంగా దగ్గరకు వచ్చే వరకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ఇటీవల పలు ప్రమాదాలు చోటుచేసుకొని వాహనదారులు గాయపడ్డ సంఘటనలు కూడా ఉన్నాయి. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించి ప్రమాదాలను నివారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# సీఐటీయూ వ్యవస్థాపకుడు రణదీవేకు నివాళి


రణదీవే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

హుజూర్‌నగర్ రూరల్, ఏప్రిల్ 6: కార్మికోద్యమ నేత, సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు రణదీవే వర్ధంతిని పురస్కరించుకొని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ హుజూర్‌నగర్ టౌన్ అధ్యక్షుడు యలక సోమయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘన నివాళులర్పించారు. హుజూర్‌నగర్‌లోని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో రణదీవే చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గాల సంక్షేమం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా రణదీవే అవిశ్రాంత పోరాటం సాగించారని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి కొమరరాజు, ఉపాధ్యక్షుడు పల్లపు రామకృష్ణ, షేక్ నాగుల్‌మీరా, నకిరేకంటి అశోక్, ఉపతల రామకృష్ణ, వేముల నాగమ్మ, తిరపయ్య, మల్లయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సైదులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 6: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో వరంగల్‌కు చెందిన శరత్ మాక్సీ క్యూర్ లేజర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దండ శ్యాంసుందర్‌రెడ్డి, సుదగాని నాగేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరానికి పెన్షనర్లు తమ హెల్త్‌కార్డులు తీసుకురావాలని తెలిపారు.

## ఆర్టీసీ డిపోలో ఫ్రిజ్ ఏర్పాటు

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 6: వేసవి దృష్ట్యా సూర్యాపేట ఆర్టీసీ డిపో ఉద్యోగుల కోసం స్వచ్ఛందంగా వాటర్ ఫ్రిజ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ అన్నారు. డిపోలో రిటైర్డ్ ఉద్యోగి సుంకరి శ్రీనివాస్ కుమార్తె శ్రావ్యశ్రీ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఫ్రిజ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఐ సైదులు నాయక్, సుంకరి శ్రీనివాస్, హరీశ్, ఏకాంబరం, లచ్చయ్య, సాగర్, ఎం.సైదులు, జాని పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హుజూర్‌నగర్ రూరల్, ఏప్రిల్ 6: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్ఐ జి.ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన బొడ్డు వెంకటేశ్వర్లు ఎటువంటి అనుమతులు లేకుండా శ్రీనివాసపురం గ్రామ శివారులోని వేములూరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గరిడేపల్లి: మండల కేంద్రానికి చెందిన పెండెం కాశయ్య అబ్బిరెడ్డి తాళ్లవాగు నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రాములు నాయక్ తెలిపారు.

# కమనీయం.. సీతారాముల కల్యాణం


కోదాడ రూరల్ : పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


సూర్యాపేటలోని నల్లాల బావి సెంటర్‌లో రాములోరి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కోదాడ రూరల్, ఏప్రిల్ 6: శ్రీరామ నవమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాలు రామనామ స్మరణతో మార్మోగాయి. రెండో భద్రాదిగా పిలువబడే మండల పరిధిలోని తమ్మర శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొన్నారు.

నాగారం: మండల కేంద్రంలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొని రాముల వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మాతృమూర్తి సావిత్రమ్మ జ్ఞాపకార్థం అన్నప్రసాద వితరణ చేశారు.

చిలుకూరు: కొత్త చిలుకూరులో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో ముస్లింలు పాల్గొని రాములోరి కల్యాణాన్ని తిలకించారు.

**పలు మండలాల్లో..**

సూర్యాపేట/కోదాడ/నేరేడుచర్ల/తిరుమలగిరి: జిల్లావ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. మేళ్లచెర్వు, మఠంపల్లి, గరిడేపల్లి, మునగాల, కోదాడ టౌన్, అనంతగిరి, చివ్వెంల, సూర్యాపేట రూరల్, సూర్యాపేట టౌన్, పెన్‌పహాడ్, ఆత్మకూర్.ఎస్, తిరుమలగిరి మండలాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీలు అన్న ప్రసాదాల వితరణ, పానకం పంపిణీ చేశారు.

# నాడు పచ్చదనం.. నేడు కళావిహీనం

- పల్లె ప్రకృతి వనాల నిర్వహణను పట్టించుకోని అధికారులు


గణపవరం పల్లె ప్రకృతి వనం (నాడు)


చెట్లు ఎండిపోయి కళావిహీనంగా గణపవరం ప్రకృతి వనం (నేడు)

కోదాడ రూరల్, ఏప్రిల్ 6: పల్లెల్లో పచ్చదనం పెంచడానికి, ప్రజలకు ఆహ్లాదం పంచడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. రకరకాల పూలు, నీడనిచ్చే చెట్లతో ప్రకృతి వనాలు పచ్చగా కళకళలాడుతూ కనిపించాయి. గ్రామీణ ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో పల్లె ప్రకృతి వనాల్లో నడుస్తూ గడిపేవారు. వనాల నిర్వహణకు అప్పటి కేసీఆర్ సర్కార్ నిధులు సకాలంలో ఇవ్వడంతో పంచాయతీ సిబ్బంది వాటిని జాగ్రత్తగా కాపాడారు. కానీ ప్రస్తుతం అధికారులు వనాల నిర్వహణను ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో చెట్లు ఎండిపోయి కళావిహీనంగా ఆనవాళ్లు లేకుండా కనిపిస్తున్నాయి. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని గణపవరం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వనం గతంలో పచ్చగా కళకళలాడేది. ప్రస్తుతం నిర్వహణ సరిగా లేక ఎండిపోయి కళావిహీనంగా మారింది.

# నెల రోజులకే నెర్రెలు పట్టిన సీసీ రోడ్డు

- నాణ్యతకు తిలోదకాలు
- పట్టించుకోని అధికారులు

మునగాల, ఏప్రిల్ 6: లక్షల రూపాయలు ఖర్చు పెట్టి వేస్తున్న సీసీ రోడ్లు మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. నెల రోజులైనా గడువకముందే పగుళ్లు తేలుతున్నాయి. కాంట్రాక్టర్లు నాణ్యతను పట్టించుకోకుండా పనులు చేసేసి చేతులు దులుపుకొంటుండగా, అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మునగాల మండల వ్యాప్తంగా కాంట్రాక్టర్లు సీసీ రోడ్లను ఇష్టారాజ్యంగా వేస్తున్నారు. వారికి నాణ్యత ప్రమాణాలు ఏ మాత్రం పట్టడం లేదు. అధికారులకు పర్సంటేజీలు ఇచ్చామా.. బిల్లులు చేయించుకున్నామా అన్నట్లుగా పరిస్థితి ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. సీసీ రోడ్ల నిర్మాణ సమయంలో అధికాలు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. డస్ట్, ధర తక్కువ ఉన్న సిమెంట్‌తో సీసీ రోడ్లు పోస్తున్నారని, ఎవరైనా ఇదేంటని ప్రశ్నిస్తే వారిపై బెదిరింపులకు దిగుతున్నారని ప్రజలు వాపోతున్నారు. మునగాలలోని 5వ వార్డులో గల ఓ వీధిలో ఇటీవల కాంట్రాక్టర్ 113 ఫీట్ల సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రెండొంతులు డస్టు, ఒక వంతు ఇసుక, తక్కువ ధర కలిగిన సిమెంట్‌తో సీసీ రోడ్డు వేస్తుండగా బీఆర్ఎస్ నాయకుడు వసంత కుమార్ అడ్డుకొని అధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న సంబంధిత అధికారి అక్కడకు వచ్చి ఇసుక, డస్టు కలిపి రోడ్డు పోయొచ్చని కాంట్రాక్టర్‌కు మద్దతుగా మాట్లాడారు. అయితే, దాదాపు వేసిన నెల రోజులకే రోడ్డు అడ్డంగా 3 చోట్ల పగిలింది. ఈ విషయమై సదరు అధికారికి సమాచారం ఇవ్వగా పరిశీలిస్తామని చెప్పి వారం అవుతున్నా రాలేదని స్థానికులు చెబుతున్నారు. కాగా, సీసీ రోడ్డు పగిలిన విషయం తెలుసుకున్న సంబంధిత కాంట్రాక్టర్ తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు పగిలిన చోట డాంబర్ పోశారు. పగిలిన రోడ్డును బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం నాయకులు ఆదివారం పరిశీలించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని బిల్లు డబ్బులు తిరిగి రికవరీ చేయాలని అధికారులను డిమాండ్ చేశారు.


పగిలిన సీసీ రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

## కీతవారిగూడెంలో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ట్రస్ట్ చైర్మన్ పురుషోత్తంగౌడ్

గరిడేపల్లి, ఏప్రిల్ 6: మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో వీఎన్ఆర్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పురుషోత్తంగౌడ్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు రక్తదానం దోహదపడుతుందని పేర్కొన్నారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గుండు రమేశ్, అమరగాని మణిదీప్, పోలంపల్లి వేణు, యశ్వంత్, ప్రవీణ్, అనిల్, శ్రీనివాస్, విజయ్, మహేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

నాగారం, ఏప్రిల్ 6: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004-05 బ్యాచ్ పదో విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాషబోయిన యాదగిరి, తుక్కాని మల్లారెడ్డి, దగ్గుల అవిలయ్య, గుండగాని స్వామి, రామ్మూర్తి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## నిప్పంటుకొని ఉపాధ్యాయుడు మృతి

కోదాడ రూరల్, ఏప్రిల్ 6: ప్రమాదవశాత్తు మంచానికి నిప్పంటుకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని మంగలి తండాలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగలి తండాకు చెందిన ధరావత్ బాలాజీ (52) నడిగూడెం మండలం చెన్నకేశవాపురం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా ఇద్దరు పిల్లలతో కలిసి బాలాజీ భార్య పుట్టింటికి వెళ్లారు. ఇంట్లో ఒక్కడే ఉండడంతో మద్యం తాగి ఆరుబయట మంచంలో నిద్రించాడు. ఈ క్రమంలోనే ఆయన కాల్చిన సిగరెట్ ప్రమాదవశాత్తు మంచానికి అంటుకొని మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. బాలాజీ భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ఎం.అనిల్‌రెడ్డి తెలిపారు.

## నేడు ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె తేదీని ప్రకటిస్తాం

- తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 6: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని గతంలో ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చామని, కానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదని, దీంతో నేడు సమ్మె తేదీని ప్రకటించనున్నామని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుంకరి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని లేబర్ ఆఫీస్‌లో సోమవారం రాష్ట్ర కార్యవర్గం అంతా చర్చించి మధ్యాహ్నం 3 గంటలకు సమ్మె తేదీని ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. లేబర్ ఆఫీస్‌కు సూర్యాపేట నుంచి ప్రత్యేక బస్సులో ఉద్యోగులు బయలుదేరుతారని తెలిపారు.

## ఆత్మకూర్.ఎస్ మండలంలో 30 పోలీస్ యాక్ట్ అమలు

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 6: మండలంలో ఏప్రిల్ 6 నుంచి నెల రోజుల పాటు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ నరసింహ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. పోలీసుల అనుమతి లేకుండా సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడం నిషేధమని వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నేరమని, డీజేల వినియోగంపై నిషేధం కొనసాగించనున్నట్లు చెప్పారు. ఎవరైనా మైక్‌లను ఏర్పాటు చేయాలనుకుంటే తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసుపత్రులు, విద్యాలయాలకు 100 మీటర్ల పరిధిలో మైకులు ఏర్పాటు చేయరాదని, ఈ ఉత్తర్వులు మే 5 వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కాగా, మండల ప్రజలు ఈ ఆదేశాలను తప్పకుండా పాటించాలని ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

# పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ


స్టేషన్‌ను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ పార్థసారథి

పెన్‌పహాడ్, ఏప్రిల్ 6: పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్‌ను సూర్యాపేట డీఎస్పీ పార్థసారథి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్ఐ గోపికృష్ణను ఆదేశించారు. అదేవిధంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి సీజ్ చేసిన వాహనాల వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు విధి నిర్వహణలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రాజశేఖర్, ఎస్ఐ కస్తాల గోపికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు



కృష్ణ తండాలో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ చరమందరాజు

మఠంపల్లి, ఏప్రిల్ 6: సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్స్, మాదక ద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో మండలంలోని కృష్ణ తండాలో శనివారం రాత్రి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐ మాట్లాడుతూ ప్రజల రక్షణ, భద్రత కోసం పోలీస్ వ్యవస్థ నిరంతరం పని చేస్తుందని తెలిపారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. యువత గొడవలకు దూరంగా ఉండి ఎంచుకున్న లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు పెట్టొద్దని, మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని సూచించారు. అసాంఘిక చర్యలకు పాల్పడే వారి వివరాలను పోలీసులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ పెదపంగు బాబు, కోదాడ షీ టీం ఏఎస్ఐ కృష్ణమూర్తి, కానిస్టేబుల్ నరసింహారావు, వెంకటేశ్వర్లు, లింగరాజు, విజయ్, పోలీస్ కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

- మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు


వల్లభాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ వెంకటేశ్వర్లు

చివ్వెంల, ఏప్రిల్ 6: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని ఉండ్రుగొండ, వల్లభాపురం, మోదిన్‌పురం, తిమ్మాపురం, ఏర్ర సూర్య తండా, ఐలాపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన ఆరబెట్టిన ధాన్యం తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఎం సైదయ్య, సీసీలు ఉపేందర్, వెంకన్న, శారద, శాహిన్, సంధ్య, ఉమ తదితరులు పాల్గొన్నారు.

# పాదచారులకు మజ్జిగ పంపిణీ

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 6: వేసవి కాలం దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు పట్టణానికి చెందిన యామా ప్రభాకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పూల సెంటర్‌లో ఆదివారం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేసి మాట్లాడారు. దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తే తాగునీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ప్రతి ఆదివారం ఆ చలివేంద్రాల్లో మజ్జిగ కూడా పంపిణీ చేస్తామని చెప్పారు. చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. యామా పుష్పలత, గోపి, వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

# స్టాఫ్ నర్సుకు సన్మానం


భవానిని సన్మానిస్తున్న గ్రామస్తులు

మేళ్లచెర్వు, ఏప్రిల్ 6: మండల పరిధిలోని వెల్లటూరు గ్రామానికి చెందిన వరికళ్ల భవాని ఇటీవల స్టాఫ్ నర్సు కొలువు సాధించారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు గ్రామస్తులు ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా గ్రామంలోని అభయాంజనేయస్వామి, లక్ష్మీ తిరుపతమ్మ ఆలయాల్లో రూ.2 లక్షల సొంత ఖర్చుతో బోర్లు వేయించిన ఉసిరికాయల కాశయ్యను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంకయ్య, సైదులు, అంజయ్య, ధననారాయణ, వెంకటేశ్వర్లు, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# రైతును నిండా ముంచిన నకిలీ కలుపు మందు

- ఎండిన పొలం
- అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- లబోదిబోమంటున్న బాధితుడు


ఎండిన పొలం

నేరేడుచర్ల, ఏప్రిల్ 6: నకిలీ కలుపు మందుతో పంట ఎండిపోవడంతో ఓ రైతు లబోదిబోమంటున్నాడు. ఈ విషయమై కలెక్టర్‌కు గత నెల 25న మొరపెట్టుకున్నా ఫలితం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని యల్లారం గ్రామానికి చెందిన గజ్జి శ్రవణ్ తనకున్న నాలుగెకరాల పొలంతో పాటు అదే గ్రామానికి చెందిన దిండిగాల వేణుకు చెందిన మరో 7 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని యాసంగిలో వరి సాగు చేపట్టాడు. పంట ఎదుగుదలతో పాటు దిగుబడి బాగా రావాలని మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన ఓ ఫర్టిలైజర్స్ దుకాణంలో ఓ కంపెనీకి చెందిన గుళికలు, కలుపు మందులను కొనుగోలు చేశాడు. ఈ మందులను కౌలుకు తీసుకున్న పొలంలో పిచికారీ చేశాడు. కొన్ని రోజుల తర్వాత పంట ఎదుగుదలకు రాకపోగా పొలం మొత్తం గడ్డిగా మారిపోయింది. పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టినప్పటికీ పంట చేతికిరాకపోవడంతో తీవ్రంగా నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. ఈ విషయమై ఫర్టిలైజర్ దుకాణం యజమానిని కలిసి విన్నవించగా సదరు కలుపు మందు కంపెనీ ప్రతినిధులకు సమాచారం అందించడంతో వారు పరిశీలించి నష్ట పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే, రోజులు గడుస్తున్నా కంపెనీ వారు స్పందించకపోవడంతో రైతు శ్రవణ్ స్థానిక, జిల్లా అధికారులకు సైతం విన్నవించాడు. అయినప్పటికీ ఇంత వరకు ఎటువంటి నష్టపరిహారం అందలేదు. ఇదే విధంగా జిల్లాలో ఈ కంపెనీ మందులు వాడిన చాలా మంది రైతులు నష్టపోయినట్లు అధికారులు గుర్తించారు.

**నష్ట పరిహారం వచ్చేలా చర్యలు**

రైతు శ్రవణ్ పంట నష్టపోయిన విషయం మా దృష్టికి వచ్చింది. ఈ విషయమై అధామ కంపెనీ ప్రతినిధులకు సమాచారం అందించాం. జిల్లాలో మరికొంత మంది రైతుల పొలాలు కూడా ఇదే విధంగా దెబ్బతిన్నాయి. ఈ కంపెనీ మందులు వాడడం ద్వారా నష్టపోయానని రైతు శ్రవణ్ ఫిర్యాదు చేశాడు. నష్ట పరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

- శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి, సూర్యాపేట